



సుద్దగడ్డ వరద కారణంగా గొల్లప్రోలు మండలంలో కుళ్లిపోయిన వరినాట్లు

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వాయిదా

- తదుపరి తేదీ త్వరలో వెల్లడిస్తాం
- కాకినాడ జిల్లా డీఈవో రమేష్

గొల్లప్రోలురూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ నియామక ప్రక్రియకు సంబంధించి మెరిట్ లిస్ట్‌లో ఉన్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా పడింది. ఇది సోమవారం జరగాల్సి ఉండగా వాయిదా వేశామని, తదు పరి తేదీని త్వరలో వెల్లడిస్తామని కాకినాడ జిల్లా డీఈవో పి.రమేష్ తెలిపారు.

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఈపరిశీలన జరగాల్సి ఉంది. దీని నిమిత్తం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి మెరిట్ జాబితాలోఉన్న 1241 అభ్యర్థులు పరిశీలనకు హాజరుకావాలని ఇప్పటికే సమాచారం ఇచ్చారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం ఎంఈవోలు, గెజిటెడ్ హెచ్‌ఎం, డిప్యూటీ తహసీల్దారు, ఎంఐఎస్ ఆపరేటర్‌లతో కూడిన 25 తనిఖీ బృందాలను ఏర్పాటుచేశారు. దీనికోసం ఆదివారం సాయంత్రం బందోబస్తు ఏర్పాట్లను పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ పరిశీలించారు. కానీ, అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా పడింది. ఈ మేరకు ఆదివారం రాత్రి కాకినాడ డీఈవో ప్రకటన విడుదల చేశారు. పరిశీలన తేదీని త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.



గొల్లప్రోలు మండలం చేబ్రోలులో పోలీసు బందోబస్తు ఏర్పాట్లపై పరిశీలన చేసిన పిఠాపురం సీఐ శ్రీనివాస్

అక్కడ అలా.. ఇక్కడ ఇలా!



ఏలేరు ఆయకట్టులో వరినాట్లు వేస్తున్న కూలీలు

- ఒకవైపు వరదలతో కుళ్లిపోయిన వరిపంట
- మరోవైపు సాగునీరు అందడంతో నాట్లు
- ఏలేరు, పీబీసీ ఆయకట్టులో విభిన్న పరిస్థితులు
- సాగు విరమించుకోవాలని భావిస్తున్న బాధిత రైతులు

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం/గొల్లప్రోలు)

ఒకే ఆయకట్టు విభిన్న పరిస్థితులు. ఒకచోట వరదలతో వేసి వరి పంట కుళ్లిపోగా, మరోవైపు నీరు సమృద్ధిగా అందుబాటులోకి రావడంతో వరినాట్లు ముమ్మరంగా సాగిస్తున్నారు.

50శాతం పూర్తికాని నాట్లు

ఏలేరు, పీబీసీ ఆయకట్టుకు సార్వా సాగు ప్రారంభం నుంచి ఎదురైన సాగునీటి కష్టాలతో వరినారుమడులు, నాట్లు వేయడం తీవ్ర ఆలస్యమైంది. సాదారణంగా ఆగస్టు రెండో వారం పూర్తయ్యేసరికి 80శాతం వరకూ వరి నాట్లు పూర్తి కావాల్సిఉండగా 50శాతం కూడా పూర్తికాలేదు. ఏలేరు రిజర్వాయర్‌నుంచి విడుదలైన నీరు ఆయకట్టుకు చేరకపోవడం, గోదావరిజలాలు సక్రమంగా అందకపోవడంతో ఏలేరు, పీబీసీ ఆయకట్టులోని పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో ఆగస్టు మొదటి వారం వరకూ వరి నారుమడులు వేస్తూనే ఉన్నారు, సాగునీటి లభ్యత తక్కువగా ఉండడంతో ఎక్కువమంది వెదజల్లు పద్ధతిలో వరి సాగు ప్రారంభించారు. సాగునీటి కష్టాలు ఎదురవుతున్న తరుణంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో భారీగా వర్షాలు కురవడంతో సుద్దగడ్డకు వరదలు సంభవించాయి.దీంతో 3వేల ఎకరాలకుపైగా వరి, పత్తిపంటలు ముంపునకు గురయ్యాయి. గొల్లప్రోలు, సీతానగరం, లక్ష్మీపురం, చేబ్రోలు, చెందుర్తి, మల్లవరం, తాటిపర్తి తదితర గ్రామాల్లో 1300 ఎకరాల్లోని వరి నాట్లు, వెదజల్లు పద్ధతిలో వేసిన వరి పంట కుళ్లిపోయింది. ఇవన్నీ ఏలేరు, పీబీసీ ఆయకట్టు పొలాలే. వారం రోజులు వరదనీరు ఉండిపోవడంతో రైతులు పంటను పూర్తిగా కోల్పోయారు. ఇప్పుడు తిరిగి దమ్ము చేసుకుని వరిపంట వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎకరానికి రూ.10వేల నుంచి రూ.20వేల వరకూ నష్టం వాటిల్లింది. పంట నష్టపోయిన రైతులకు 80శాతం సబ్సిడీపై వరి విత్తనాలు అందజేస్తామని వ్యవసాయాధికారులు ప్రకటించినా ఇప్పటివరకూ అవి అందలేదు. దీంతో రైతులు పంట సాగు విరమించుకుంటే మేలనే భావనలో ఉన్నారు.

ఇక్కడ మాత్రం..

తరచూ వరద ముంపు బెడదతో అక్కడ పంట సాగునే విరమించుకోవాలని రైతులు భావిస్తుంటే అదే ఆయకట్టు పరిధిలో మిగిలిన ప్రాంతాల్లో భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. ఇక్కడ వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మూడురోజులుగా నీరు పుష్కలంగా అందుబాటులో ఉండడంతో పొలాలు దమ్ము చేసి వరినాట్లు వేయడంలో నిమగ్నమయ్యారు. గత ఐదు రోజుల్లోనే 25శాతంపైగా విస్తీర్ణంలో రైతులు వరినాట్లు వేశారు. సెప్టెంబరు మొదటివారం నాటికి నాట్లు పూర్తయ్యే అవకాశం ఉంది. ఏలేరు, పీబీసీ ఆయకట్టులో ఒకవైపు చకచకా నాట్లు పడుతుండగా, మరోవైపు వరదల కారణంగా పంటలు నష్టపోయిన రైతులు అటు ప్రభుత్వం ఆదుకోక, మళ్లీ వర్షాలు వస్తే ముంపు తప్పదేమోన్న ఆందోళనతో సాగునే విరమించుకోవాలని భావిస్తుండడంతో రైతులు ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితులకు అద్దం పడుతోంది. ప్రభుత్వం ఇటువైపు చూడాలని వారు కోరుతున్నారు.

ఐ ఫోన్‌లో.. అనంత రహస్యం!



నేటికీ తెరుచుకోని అనంతబాబు ఐ ఫోన్

- డ్రైవర్ హత్య కేసు విచారణలో చిక్కులు
- కీలక ఆధారాలకు తప్పని తిప్పలు
- ఐ ఫోన్ సీజ్.. పాస్‌వర్డ్ వదిలేశారు
- ఎస్ఎఫ్ఎల్‌కు ఫోన్ పంపారు
- ఆధారాలకు ప్రయత్నమే లేదు
- మొక్కుబడిగా ఛార్జిషీటు దాఖలు
- అప్పట్లో సహకరించిన పోలీసులు
- పాస్‌వర్డ్‌కు తాజాగా ప్రయత్నాలు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ హత్య కేసు తదుపరి విచారణలో పోలీసులకు చుక్కలు కనిపిస్తున్నాయి. కేసును లోతుగా మళ్లీ విచారించి 90 రోజుల్లో ఛార్జిషీటు దాఖలు చేయాలని న్యాయస్థానం ఆదేశించి గురువారంతో నెలపూర్తయింది.ఈ నెల రోజుల్లో కీలక ఆధారాలు చేజిక్కించుకోవడం విచారణ బృందానికి సవాల్‌గా మారింది. అనంతబాబు వద్ద డ్రైవర్‌గా పనిచేసే వీధి సుబ్రహ్మణ్యం 2022 మే 18న కాకినాడలో హత్యకు గురయ్యాడు. దీనిపై అప్పటి వైసీపీ సర్కారు హయాంలో ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో కేసు విచారణ నీరుగార్చేశారు. నిందితుడికి అనుకూలంగా పోలీసులు మొక్కుబడి ఛార్జిషీటు దాఖలు చేశారు. దీంతో అనంతబాబు బెయిల్‌పై సులువుగా బయటకు వచ్చేశారు. బాధితుడి తల్లిదండ్రుల పోరాటం కారణంగా ప్రస్తుత ప్రభుత్వం సైతం ఈ హత్య కేసు సీరియస్‌గా తీసుకుంది. గత నెల 22న రాజమహేంద్రవరంలోని అట్రాసిటీ న్యాయస్థానం తదుపరి విచారణకు అనుమతిచ్చింది. 90 రోజుల్లోగా కేసును విచారించి ఛార్జిషీటు దాఖలు చేయాలని విచారణ అధికారి అయిన ఐపీఎస్ అధికారి పాటిల్ దేవరాజ్‌ను ఆదేశించింది.ఈ మేరకు విచారణ చేపట్టిన పోలీసులు కేసులో తదుపరి పురోగతి సాధించడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. అప్పట్లో నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న ఐ ఫోన్‌కు సంబంధించి కనీసం పాస్‌వర్డ్ కూడా తీసుకోలేదని తాజాగా గుర్తించారు. కీలకమైన సీసీ కెమెరా ఫుటేజీ, ఇతర సాంకేతిక ఆధారాలు ఛార్జిషీటుకు జతచేయకుండా వదిలేశారని తేల్చారు. ఈ నేపథ్యంలో అనంతబాబు ఐ ఫోన్ పాస్‌వర్డ్‌ను సేకరించేందుకు న్యాయస్థానం ద్వారా ప్రయత్నాలు ఆరంభించారు. హత్య కేసు విచారణకు రావాలంటూ అనంతబాబు భార్యతో పాటు మరో ఇద్దరికి తాజాగా నోటీసులు జారీ చేశారు. తీరా వీరంతా హైకోర్టును ఆశ్రయించడం విశేషం. దీంతో నెలరోజులు దాటినా కేసు తదుపరి విచారణలో పురోగతి లేదు.

అనంతబాబు భార్యకు నోటీసులు

హత్య కేసుకు సంబంధించి నిందితుడు అనంతబాబు భార్యను అప్పట్లో పోలీసులు విచారించలేదు.విచారణలో కీలకంగా భావించి అనంతబాబు భార్య అనంత లక్ష్మీదుర్గ విచారణకు రావాలని పోలీసులు ఇటీవల నోటీసులు జారీచేశారు. ఈమెతో పాటు ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచికి చెందిన ఎర్రల గంగాధర్, ఎర్రల ప్రవీణ్ అనే మరో ఇద్దరికి నోటీసులు పంపారు. తీరా దీన్ని వ్యతిరేకిస్తూ ఈ ముగ్గురు తాజాగా హైకోర్టును ఆశ్రయించడం విశేషం. ఇదిలా ఉంటే మృతుడి తల్లి నూకరత్నం సైతం తన కుమారుడి హత్య కేసులో అనుమానాలు వ్యక్తం చేస్తూ ఇప్పటికే డీజీపీకి ఫిర్యాదు చేశారు. నిందితుడి ఐఫోన్ పాస్‌వర్డ్ సేకరించి ఫోన్ తెరిస్తే పలు కీలక ఆధారాలు బయటపడే అవకాశం ఉంది.

ఐ ఫోన్‌లో ఏముంది!

హత్యకు పాల్పడిన కొన్నిరోజులకు పోలీసులు అనంతబాబు ఐ ఫోన్ స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. హత్య జరిగిన కొన్ని రోజుల ముందు, ఆ తర్వాత అనంతబాబు ఎవరెవరితో ఏం మాట్లాడారు? వాట్సాప్ కాల్స్ ఎవరెవరికి చేశారు?ఫోన్‌లో ఏమేం వీడియో, ఆడియోలు ఉన్నాయి? హత్యకు కొన్ని రోజుల ముందు డ్రైవర్‌తో ఏమైనా వాట్సాప్ కాల్స్ ద్వారా గొడవలు పడ్డారా? వంటి కీలక ఆధారాలు ఫోన్ నుంచి సేకరించాల్సి ఉన్నా కనీసం పట్టించుకోలేదు. నిందితుడి ఐ ఫోన్‌కు సంబంధించి పాస్‌వర్డ్ తీసుకోలేదు. ఫోన్‌ను స్టేట్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి పాస్‌వర్డ్ ఇవ్వకుండా వదిలేశారు. దీంతో ఇప్పటికీ ఐ ఫోన్ తెరవలేదని తాజాగా గుర్తించారు. ఇప్పుడు ఆ ఫోన్‌ను తెరవాలంటే నిందితుడి నుంచి పాస్‌వర్డ్‌ను న్యాయస్థానం అనుమతి ద్వారా సేకరించాలి. దీంతో ఇప్పుడు విచారణ అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు ఆరంభించారు.ఇది తెరిస్తేనే అనేక కీలక ఆధారాలు బయటకు వచ్చే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.హత్య జరిగినప్పుడు నిందితుడు డ్రైవర్ ఇంటికి మృతదేహాన్ని కారులో తేవడం, ఆ తర్వాత మృతుడి తల్లిదండ్రులతో గొడవపడి పారిపోవడం,అనంతబాబు ఉంటున్న అపార్ట్‌మెంట్ వద్ద ఓ మహిళతో సంచరిం చిన వీడియోలు ఇలా అనేక కీలక సాక్ష్యాలను సైతం అప్పట్లో ఛార్జిషీటుతో దాఖలు చేయకుండా నిందితుడికి సహకరించినట్టు తాజాగా గుర్తించారు. సాంకేతిక ఆధారాలకు ప్రస్తుతం తిప్పలు పడుతున్నారు. అనంతబాబు గన్‌మెన్ ఆ సమయంలో ఏమయ్యారు? హత్య చేసినప్పుడు అనంతబాబుతో ఉన్న వ్యక్తులెవరు? అనేవేవీ అప్పట్లో ఛార్జిషీటులో ప్రస్తావించకుండా అనేక తప్పిదాలు చేసినట్టు గుర్తించి విస్తుపోతున్నారు.అవన్నీ ఇప్పుడు సేకరిస్తున్నారు. ఇటీవల అనంతబాబు గన్‌మెన్‌ను పోలీ సు లు విచారించారు. హత్య జరిగినప్పుడు ఎక్కడున్నారు? అనేదానిపై లోతుగా ఆరాతీశారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహిస్తామని కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లా అధికారులంతా హాజరుకావాలన్నారు. పీజీఆర్ఎస్‌కు హాజరుకాలేని వారు అర్జీలు మీకోసం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయవచ్చునన్నారు.

రేపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ రాక

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర సారథి పీవీఎన్ మాధవ్ ఈనెల 26న కాకినాడ జిల్లాకు రానున్నారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు నేతృత్వంలో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం ఉదయం 7:30 గంటలకు నాగమల్లితోట జంక్షన్‌లో ఛాయ్ పే చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. 9:15 గంటలకు జగన్నాథపురం ఘాటీ సెంటర్‌లో మల్లాడి సత్యలింగనాయకర్ విగ్రహానికి నివాళులర్పిస్తారు. 10గంటలకు ర్యాలీగా కాకినాడ సూర్యకళా మందిరం చేరుకుని 11గంటలకు కార్యకర్తల సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు విలేకరుల సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 4గంటలకు ఇంటలెక్చువల్ మీట్ జరుగుతుంది. 5:30 గంటలకు పద్మశ్రీ సంకురాత్రి చంద్రశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలుస్తారు.

మత్స్యకారులకు అండగా ఉంటా

కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మత్స్యకారులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ పేర్కొన్నారు. పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలానికి చెందిన మత్స్యకార సంఘాల నాయకులతో తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మత్స్యకారులకు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. యు.కొత్తపల్లి మండలం అమీనాబాద్ హార్బర్ వద్ద రోడ్డును నిర్మించాలని మత్స్యకార సంఘం నాయకులు కోరగా ఎంపీ లాడ్స్ నిధులతో నిర్మిస్తామని ఆయన హామీఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మలబాబు, మత్స్యకార సంఘం నాయకులు గంటా విజయ్ కుమార్, నక్కా చినబాబు, సూరాడ నాగేశ్వరరావు, మరడ కొండయ్య, చోడిపల్లి చిట్టిబాబు, ముడి జగన్నాథం పాల్గొన్నారు.

బార్‌మంటున్నారు!



బార్‌లకు ముందుకురాని వ్యాపారులు

- నష్టపోతామని వెనుకంజ
- ఇక మిగిలింది రెండు రోజులే
- 46 బార్లకు 11 ఎన్‌రోల్‌మెంట్లు
- దరఖాస్తులకు ఎక్సైజ్ శాఖ పట్టు
- మద్యం దరఖాస్తుదారులకు మెసేజ్‌లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రండి బాబు.. రండి.. దరఖాస్తు చేయండి.. మంచి తరుణం మించిన రాదు..అంటూ గతంలో ప్రైవేటు మద్యం షాపులకు దరఖాస్తు చేసిన వాళ్లందరికీ ఎక్సయిజ్ అధికారులు వేలల్లో మెసేజ్‌లు పంపుతున్నారు. దాబాల వద్దకు వెళ్లి దరఖాస్తు చేయమని వేడుకుంటున్నారు. అయితే కొత్త బార్ పాలసీకి సంబంధించి వ్యాపారులు ముఖం చాటేస్తున్నారు.. ఎక్సైజ్ అధికా రులు మాత్రం దరఖాస్తులు పెరిగేలా చర్యలు చేపడుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 46 బార్‌లకు నోటి ఫికేషన్ విడుదల చేయగా ఇప్పటి వరకూ కేవలం 11 ఎన్‌రోల్‌మెంట్లు మాత్రమే జరిగాయి.అయినా ఒక్కో బార్‌కి 10 దరఖాస్తులు వస్తాయని ఎక్సయిజ్ అధికారులు ధీమాగా ఉన్నారు. ఈ నెల 26 (మంగళవారం) దరఖాస్తు గడువు ముగుస్తుంది. ఇంకా మిగి లింది రెండు రోజులే..అయినా ఎన్‌రోల్‌మెంట్ చూస్తేనే నీరసంగా ఉంది. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 1 నుంచి బార్‌లు ఉంటాయా.. అనే సందిగ్ధం ఫుల్‌గా ఉంది.

ఇవీ వ్యాపారుల లెక్కలు

రాజమహేంద్రవరంలో ఒక బార్‌కు దరఖాస్తు చేయాలంటే ఖర్చు ఇలా ఉంటుందని వ్యాపారులు లెక్కలు వేసుకుంటు న్నారు..ఒక్కో షాపునకు 4 దరఖాస్తులు తప్పనిసరి.. మూడు దరఖాస్తులు వచ్చినా లాటరీ ఉండదు. ఆ లెక్కన సిండికేట్‌గా 4 షాపులకు దరఖాస్తు చేయాలి.అంటే ఫీజు రూ.20.40 లక్షలు, లైసెన్స్ రుసుం ఏడాదికి రూ.55 లక్షలు, ఇష్యూ ప్రైస్‌పై 15 శాతం అదనంగా అదనపు రిటైల్ ఎక్సయిజ్ టాక్స్ (ఏఆర్‌ఈటీ) సుమారు రూ.54 లక్షలు, నెలకు బార్ అద్దె రూ.1.25 లక్షలు, కరెంటు బిల్లు రూ.30 వేలు, రవాణా రూ.30 వేలు, జీతాలు రూ.1.50 లక్షలు, సివిల్ పోలీ సులకు నెలకు రూ.15 వేలు, ఎక్సయిజ్ వాళ్లకు రూ.50 వేలు..ఇలా మొత్తం కలిపి సుమారు రూ.1.80 కోట్లు ఏడాదికి వెచ్చించాల్సి ఉంటుందని వ్యాపారులు లెక్కలు వేసి చూపిస్తున్నారు. ఇంత ఖర్చు చేసి తాము నష్టపోకుండా ఉండాలంటే రోజుకు కనీస అమ్మకం రూ.3 లక్షలు ఉండాలని, అలా ఉండాలంటే క్వార్టరుపై కనీసం రూ.50 అదనంగా అమ్మినా కష్టమేనని, ప్రైవేటు మద్యం షాపులకు పర్మిట్ రూమ్‌లు ఉండగా అంత సొమ్ము అదనంగా చెల్లించి బార్‌లకు ఎవరు వస్తారని అంటున్నారు. పక్క రాష్ట్ర మైన తెలంగాణలో దరఖాస్తు ఫీజు రూ.1 లక్ష మాత్ర మేనని ఉదాహరణ చూపెడుతున్నారు.

బార్లు ఫుల్.. ఎన్‌రోల్‌మెంట్ నిల్

కొత్త బార్‌లకు సంబంధించి ఎన్‌రోల్‌మెంట్ నీరసంగా నడుస్తోంది. బార్‌ల లాటరీలో పాల్గొనాలంటే తొలుతగా ఉచితంగా ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవాలి. తర్వాత ప్రాసెసింగ్ ఫీజు రూ.10 వేలు చెల్లిస్తే ప్రక్రియ మొదలవుతుంది. అనంతరం రూ.5 లక్షలు దరఖాస్తు ఫీజు చెల్లించిన వారికి లాటరీలో పాల్గొనే అవకాశం దక్కుతుంది. అయితే ఉచితమైనప్పటికీ ఎన్‌రోల్‌మెంట్ అత్యంత నీరసంగానే సాగుతోంది. ఇంకా 2 రోజులే సమయం ఉన్నా కనీసం ఒక్క దరఖాస్తు సమర్పించలేదు.ఈ నెల 23న సాయంత్రం సమయానికి డా.బీఆర్ అంబేడ్కర్ కోన సీమ జిల్లాకు 9 బార్‌లు కేటాయించగా ఎన్‌రోల్‌మెంట్లు 4 జరిగాయి. ఇద్దరు మాత్రమే రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించారు.తూర్పు గోదావరి జిల్లాలో 22 షాపులకు మూడు ఎన్‌రోల్‌మెంట్లు జరగ్గా రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించలేదు. కాకినాడ జిల్లాకు సంబంధించి 15 బార్‌లకు ఐదుగురు మాత్రమే రిజిస్టరు అయ్యారు. ఒక్కో షాపునకు రూ.5.10 లక్షల చొప్పున దరఖాస్తు ఫీజును చెల్లించి 4 దరఖాస్తులు సమర్పించాలని తొలుత ప్రభుత్వం నిబంధన విధిం చినా వ్యాపారుల విన్నపాన్ని పరిగణనలోకి తీసుకొని దానిని సడలించింది. లాటరీలో షాపు దక్కించుకొన్న దరఖాస్తు మినహా మిగతా వారికి ఆ సొమ్ములు తిరిగి చేస్తామని ఎక్సైజ్ కమిషనర్ ప్రకటించారు. అయినా ఎన్‌రోల్‌మెంట్ మాత్రం నీరసంగానే సాగుతోంది. ఎక్సయిజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ శనివారం జిల్లాకు రావడంతో ఆయనతో సమావేశమై ఇబ్బందులను వివరించవచ్చని బార్ వ్యాపారులు ఆశించినా ఫలించలేదు.

నిబంధనలు మార్చాలి..

బార్ పాలసీలో మార్పులు చేయకపోతే నెలకు కనీసం రూ.10 లక్షల వరకూ నష్టం భరించాల్సి ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు.పక్క రాష్ట్రంలోని హైదరాబాద్, సికింద్రాబాద్ మెట్రో సిటీల్లో సైతం రూ.40 లక్షల వార్షిక ఫీజు ఉండగా 22 శాతం మార్జిన్ సదుపాయం ఉంది.అయినప్పటికీ అక్కడా నష్టాలు భరిస్తున్నారు.బార్ ఏర్పాటుకు ఫర్నిచర్, సామగ్రి వంటి వాటికి లక్షల్లో పెట్టుబడి పెట్టా లి. అందువల్ల వార్షిక లైసెన్సు ఫీజులో ఎంతో కొంత పెంపుదల చేసి అప్పటికే ఉన్న బార్‌లను కొనసాగిస్తారు.ఇదే విధానం తెలంగాణలో ఉన్నా నష్టాలు వస్తున్నాయి. ఏపీలో ఇప్పుడు మూడేళ్లలో లైసెన్స్ అంటున్నారు. తర్వాత మళ్లీ లాటరీ అంటే.. తమకు షాపు రాకపోతే లక్షల రూపాయల సామగ్రి, ఫర్నీచర్ ఏం చేసుకోవాలని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. ఆ నిబంధన మార్చాల ని డిమాండ్ చేస్తున్నారు.

మెయిన్‌లో..

నిజాలకు ‘పరదా’

- సీఎం పెద్దాపురం పర్యటనపై జగన్ పత్రిక విష ప్రచారం
- స్వచ్ఛ ర్యాలీ ఫ్లెక్సీలను వెనుకనుంచి ఫొటో తీసి బురద జల్లుడు
- వీటిని చూపి పరదాలు అంటూ అడ్డగోలు రాతలు

నేడు, రేపు దిండి-చించినాడ వంతెనపై రాకపోకలు నిలుపుదల

7

మహిళపై మేల్ నర్స్ అకృత్యాలు

సత్యదేవుడికి రథోత్సవం

అన్నవరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ఆదివారం ఆర్జితసేవయిన రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 10గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తోడ్కొనివచ్చి వివిధ సుగంధభరిత పుష్పాలతో తీర్చిదిద్దిన టేకురథంపై ఆశీనులు గావించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తూర్పురాజగోపురం చుట్టూ భక్తుల గోవిందనామస్మరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించి అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.



రథంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

డొక్కా సీతమ్మ జీవిత చరిత్రపై...

లంకలగన్నవరంలో డాక్యుమెంటరీ చిత్రీకరణ

పి.గన్నవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అపర అన్నపూర్ణగా ప్రసిద్ధిగాంచిన డొక్కా సీతమ్మ జీవి త చరిత్రను ఇప్పటికే వివిధ రూపాల్లో తెరకెక్కించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వాలు పలు తరగతుల పాఠ్య పుస్తకాల్లో ప్రచురించారు. తాజాగా గౌరి ప్రసాద్ మీడియా బ్లాక్అండ్వైట్ మూవీ మార్క్ సంస్థ అన్నపూర్ణతల్లి బువ్వమ్మ పేరుతో డాక్యుమెంటరీని చిత్రీకరిస్తున్నారు. డైరెక్టర్ సురేష్ లంకలపల్లి నూతన నటీనటులతో పలు దృశ్యాలను ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలోని లంకలగన్న వరంలో గోదావరి తీర ప్రాంతంలో చిత్రీకరించారు. దర్శకుడు సురేష్ మాట్లాడుతూ డొక్కా సీతమ్మ అడిగినవారికి లేదనకుండా అన్నం వండి వడ్డించేవారని.. ఆమె జీవిత విశేషాలు, అపురూప ఘట్టాలను తెరకెక్కిస్తున్నామన్నారు. 2రోజులు పాటు లంకలగన్నవరంలో డొక్కా సీతమ్మ నివాసం, గోదావరి నదిపరివాహక ప్రాంతాలతో పాటు పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం అయోధ్యలంకలో పలు సన్నివేశాలను చిత్రీకరిస్తామని చెప్పారు. ఈ డాక్యుమెంటరీకి నిర్మాతగా సీరాజ్, ఖాదర్ వ్యవహరించగా సింహరాశి డైరెక్టర్ సముద్ర, షిలిక లేనౌజా, ఆదిల్, రమేష్, కుసుమ తదితర నూతన నటులు నటిస్తున్నారని.. సంగీతం సాకేత్‌వేణి అందించగా ఆర్య సాయి కృష్ణ కెమెరామెన్‌గా పనిచేస్తున్నారని తెలిపారు. డాక్యుమెంటరీని అక్టోబర్‌లో విడుదల చేస్తామని ఎగ్జిక్యూటివ్ మేనేజర్ పి.శ్రీనివాస్ స్పష్టం చేశారు.



లంకలగన్నవరం కోడేరు రేవు వద్ద ఓ సన్నివేశం చిత్రీకరణ

పెద్దది.. బాగున్నది!

ఆకట్టుకున్న సీతాకోకచిలుక



పెద్ద సైజులో ఉన్న సీతాకోక చిలుకను ఫొటో తీసుకుంటున్న ప్రజలు

వై.రామవరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సీతాకోకచిలుకలు సహజంగానే అందంగా కనిపిస్తాయి. అల్లూరి జిల్లా వై.రామవరం- యార్లగడ్డ గ్రామాల మధ్య రహదారి పక్కన చెట్టు ఆకుల మధ్య ఉన్న కాండానికి పెద్ద సైజు సీతాకోక చిలుక వేలాడుతూ చూపరుల దృష్టి ని ఆకర్షించింది. దీని రెక్కల వెడల్పు అటు నుంచి ఇటు 8 అంగుళాలు ఉంది.



ఇంటర్నేషనల్ గ్రాండ్ ప్రిక్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు

న్యాయనిర్ణేతగా శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

అమలాపురం టౌన్ ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పూణేలో ఈనెల 26 నుంచి 31వరకు జరిగే ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ గ్రాండ్ ప్రిక్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు కోనసీమ జిల్లా అమలాపురం శివారు కొంకాపల్లికి చెందిన పాయసం శ్రీనివాసరావును న్యాయనిర్ణేతగా నియమిస్తూ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి ఆదివారం నియామక ఉత్తర్వులను అందుకున్నారు. మరోసారి న్యాయనిర్ణేతగా నియామక పత్రాలను అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ హిమంత బిశ్వాశర్మ, ప్రధాన కార్యదర్శి సంజయ్ మిశ్రాల నుంచి అందుకున్నారు. శ్రీనివాసరావు నల్లచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటికే ఆయన థామస్ ఊబర్‌కప్, వరల్డ్ స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్, ఖేలో ఇండియా, ఆల్‌ఇండియా ర్యాంకింగ్ టోర్నమెంట్లతో పాటు పలు జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్లకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ప్రపంచస్థాయిలో క్రీడాకారుల ఎదుగుదలకు ఎంతో ముఖ్యమైన ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ గ్రాండ్ ప్రిక్స్ వంటి ప్రతిష్ఠాత్మకమైన టోర్నమెంట్‌కు ఎంపిక చేయడం పట్ల బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి అంకమ్మచౌదరి, ఉమ్మడి జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కొత్తపల్లి బాబు, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, డీఎస్డీవో పీఎస్‌సురేష్‌కుమార్, కోనసీమ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు మెట్ల రమణబాబు, అల్లాడ శరత్‌బాబు పలువురు అభినందించారు.

కారు, బస్సు ఢీ : లారీ క్లీనర్ మృతి

శంఖవరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి 16వ నెంబరు జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోతే సూరిబాబు (42) మృతిచెందాడు. అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన సూరిబాబు లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం కత్తిపూడి 16వ నెంబరు జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా రాజమహేంద్రవరం వైపు నుంచి తుని వైపు వెళ్తున్న కారు, బస్సు వెంట వెంటనే ఢీకొనడంతో అక్కడి కక్కడే క్లీనర్ మృతి చెందాడు. అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న అన్నవరం ఎస్ఐ

టాటా ఏస్ ట్రక్కు ఢీకొని యువకుడి మృతి

కొవ్వూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం సాగిపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కొవ్వూరు మండలం తోగుమ్మి గ్రామానికి చెందిన యువకుడు మృతిచెందాడు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. కొవ్వూరు మండలం తోగుమ్మి గ్రామానికి చెందిన ముప్పిడి నరేష్ (26) గుడ్డిగూడెంలో ఉన్న అక్క నాగలక్ష్మిని, ఆరుగొలను బాలాతల్లి భవానిని చూడడానికి ఇద్దరూ కలిసి బైక్‌పై బయలుదేరారు. గోపాలపురం మండలం సాగిపాడు శివారున టాటా ఏస్ ట్రక్కు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో నరేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. రాపాక బాలాకుమార్ కాలుకు తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. దీంతో తోగుమ్మిలో విషాదఛాయలు అలముకున్నాయి.



మృతిచెందిన నరేష్

ఐషర్ వ్యాన్ ఢీకొని వృద్ధుడి మృతి

ఉప్పలగుప్తం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. ఎస్ఐ చలమల రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వానపల్లిపాలెంకు చెందిన కోలా వీరరాఘవులు(75) ఉప్పలగుప్తం నుంచి వానపల్లిపాలెం సైకిల్‌పై వెళ్తుండగా ఐషర్ వ్యాన్ వెనుక నుంచి ఢీ కొనడంతో వీరరాఘవులు అక్కడికక్కడే మరణించాడు. మృతుడి భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



వీరరాఘవులు (ఫైల్)

బైక్ ఢీకొని మహిళ మృతి

నరేంద్రపురం జంక్షన్ వద్ద ఘటన

రాజానగరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రాజానగరం-నరేంద్రపురం కూడలిలో శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో 16వ వార్డుకు చెందిన అనిశెట్టి లత(33) రాజానగరంలో బంధువుల ఇంటికి వెళ్తున్నానని చెప్పి శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయలుదేరింది. రాజానగరం సమీపంలోని నరేంద్రపురం జంక్షన్ వద్ద నడుచుకుంటూ హైవే దాటుతుండగా దివాన్‌చెరువు వైపుగా వేగంగా, నిర్లక్ష్యంగా వస్తున్న మోటార్‌సైకిల్ ఢీకొంది. దీంతో లత తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి వద్ద ఉన్న ఫోన్ నెంబర్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా లత భర్త అనిశెట్టి శ్రీను బండిపై టిఫిన్ అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె గాయత్రి ఇంటర్మీడియట్ పూర్తి చేయగా, చిన్న కుమార్తె కావేరి ఇంటర్ మొదటి ఏడాది చదువుతోంది. మృతురాలి భర్త ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు

నలుగురి అరెస్ట్.. రూ.8.40 లక్షల నగదు, 8 సెల్‌ఫోన్లు, టీవీ స్వాధీనం



క్రికెట్ బెట్టింగ్ ముఠా వివరాలు వెల్లడిస్తున్న నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్

కోరుకొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నార్త్‌జోన్ పరిధిలో స్థానిక పోలీసులు క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. కోరుకొండ పోలీస్‌స్టేషన్లో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్ వివరాలను వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు కోరుకొండ మండలం కాపవరంలోని ఓ ఇంట్లో నిర్వహించిన దాడుల్లో బెట్టింగ్ ముఠాను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.8.40 లక్షల నగదు, 8 సెల్‌ఫోన్లు, టీవీ, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. బెట్టింగ్‌కి పాల్పడుతున్న ప్రధాన నిందితుడిగా గుర్తించిన విశాఖపట్నానికి చెందిన రాకేష్ పరారీలో ఉన్నాడని.. బెట్టింగ్‌కు పాల్పడిన గోసంశెట్టి వీరప్రసాద్, జాజుల బాలచక్రం, నల్లల లక్ష్మీనరసయ్య, కొడతాల నానాజీని అరెస్ట్ చేశామన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన కోరుకొండ, సీతానగరం పోలీస్ సిబ్బందికి రివార్డు అందజేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ఆన్‌లైన్ బెట్టింగ్‌ల వల్ల కుటుంబాలు నాశనం అవుతున్నాయని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. సమావేశంలో సీఐ వై.సత్యకిషోర్, ఎస్ఐ కేవీ నాగార్జున, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

29న పవర్‌లిఫ్టింగ్ పోటీలు



పవర్‌లిఫ్టింగ్ పోటీల ట్రోఫీలు, మెడల్స్‌ను ఆవిష్కరిస్తున్న శరత్‌బాబు తదితరులు

అమలాపురం టౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 29న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో 4వ యునైటెడ్ ఈస్ట్ అండ్ వెస్ట్ గోదావరి జిల్లాల పవర్‌లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలను నిర్వహిస్తున్నట్టు పవర్‌లిఫ్టింగ్ పోటీల ఆర్గనైజర్, కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల స్థాయిలో జరిగే పోటీల వివరాలను జిల్లా ఒలింపిక్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి వివరించారు. సబ్ జూనియర్, సీనియర్, మాస్టర్స్ విభాగాల్లో స్త్రీ, పురుషులకు వేర్వేరుగా 30 కేటగిరీల్లో ఈ పోటీలను నిర్వహిస్తామన్నారు. విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లు, ఒలింపిక్ మెడల్స్ చాంపియన్ షిప్ ట్రోఫీలతో పాటు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ పోటీల ట్రోఫీలు, చాంపియన్స్ మెడల్స్‌ను ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో ఆదివారం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు ఆవిష్కరించారు. ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ గోకరకొండ నాగేంద్ర, ఉపాధ్యక్షుడు కల్వకొలను బాబు, జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, ట్రోఫీల స్పాన్సర్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అడపా వెంకటసుబ్రహ్మణ్యం, ఆశెట్టి ఆదిబాబు, పెద్దిరెడ్డి రాము, యెరుబండి చంటి, గొలకోటి నారాయణరావు, నార్ని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళపై మేల్ నర్స్ అకృత్యాలు

- తనతో ఉండాలని వేధింపులు
- ఫొటోలను మార్ఫింగ్ చేసి బాధితురాలి కొడుక్కి పంపిన వైనం
- కాకినాడ వన్‌టౌన్ పీఎస్‌లో కేసు

జీజీహెచ్(కాకినాడ) ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో మేల్ నర్స్‌గా పనిచేస్తున్న సందీప్ అనే వ్యక్తి ఓ మహిళపై అకృత్యాలకు పాల్పడాడు. అతడు చేస్తున్న దారుణాలపై ఆ మహిళ ఆదివారం సాయంత్రం కాకినాడ వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసినట్టు సీఐ ఎం.నాగదుర్గారావు తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారురాలి భర్త కొంతకాలం క్రితం మరణించాడు. ఆమె మనోవేదనకు గురైన సమయంలో కాకినాడ జీజీహెచ్‌లో మేల్ నర్సుగా పని చేస్తున్న సందీప్ దగ్గరయ్యాడు. సహజీవనం పేరుతో ఆమెతో చనువు పెంచుకున్నాడు. నాటి నుంచి బాధితురాలికి తెలియకుండా స్నానం చేస్తున్నప్పుడు ఫొటోలు, వీడియోలు తీసి భద్రపరుకున్నాడు. ఆ ఫొటోలను అడ్డుపెట్టుకుని తన భార్యకు విడాకులు ఇస్తున్నానని, ఆమెను పెళ్లి చేసుకోమని బలవంతం చేశాడు. అప్పటికే సందీప్ స్త్రీలోలుడని, దురలవాట్లు ఉన్నవాడని గుర్తించిన మహిళ తనకు ఇష్టం లేదని తెగేసి చెప్పింది. దీంతో సందీప్ దాచిపెట్టుకున్న ఫొటోలతో పాటు మరికొన్ని ఫొటోలను మార్ఫింగ్ చేసి ఆమెకే పంపాడు. ఆమె ప్రశ్నించగా తనతో ఉంటే ఫొటోలు ఎవరికి పంపనని లేదా సోషల్ మీడియాలో పెడతానని చెప్పాడు. బాధితురాలు లొంగకపోయేసరికి బంధువులందరికీ ఆ ఫొటోలను పంపాడు. ఆమె నుంచి ఏ స్పందన లేకపోయేసరికి శనివారం రాత్రి ఆ ఫొటోలను బాధితురాలి కొడుకైన మైనర్ బాలుడికి పంపించాడు. ఫోన్ చేసి మరీ బాలుడికి చెప్పాడు. బాలుడు ఫొటోలు చూసి మనస్తాపం చెందాడు. శనివారం రాత్రి ఆ బాలుడు ఇంటి నుంచి బయటకు వచ్చేసి నేను తట్టుకోలేకపోతున్నాను బ్రతకనని చెప్పి వెళ్లిపోయాడు. బంధువులు ఆ బాలుడి కోసం గాలించి ఆదివారం గుర్తించారు. సందీప్ అకృత్యాలు తాళలేకపోయిన మహిళ పోలీసులను ఆశ్రయించింది. రాష్ట్ర మహిళా కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసింది. వన్‌టౌన్ పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశాడు. సందీప్ పరారీలో ఉన్నాడని, అతడి ఆచూకీపై దర్యాప్తు చేస్తున్నామని సీఐ నాగదుర్గారావు తెలిపారు.

వాడపల్లి వెంకన్నకు బంగారు ఆభరణాలు సమర్పణ

ఆత్రేయపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలంలోని వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామికి ఓ అజ్ఞాత భక్తుడు 107 గ్రాముల బంగారు ఆభరణాలను సమర్పించాడు. శనివారం రాత్రి స్వామిని దర్శించుకున్న భక్తుడు 90 గ్రాముల కంఠాభరణం, 17 గ్రాములతో బంగారు గొలుసు సుమారు రూ.11లక్షల విలువైన వస్తువులను సమర్పించాడు. సంప్రోక్షణ అనంతరం స్వామివారికి అలంకరించనున్నారు.

శ్రీపాద శ్రీవల్లభులకు సహస్ర లిల్లీ పుష్పపూజ



లిల్లీ పుష్పపూజ అనంతరం ప్రత్యేక అలంకారంలో శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతి

పిఠాపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో జరుగుతున్న శ్రీపాదశ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా నాల్గోరోజు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీపాదులకు సహస్ర లిల్లీ పుష్పపూజ నిర్వహించారు. శ్రీపాదశ్రీవల్లభుల దివ్య పాద పద్మములకు ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. గోపూజ, పల్లకీసేవ జరిగాయి. శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయుడు, నృసింహ సరస్వతులను పుష్పాలు, తులసీదళాలుతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజాది కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా ఆలయ ఈవో ఆర్.సౌజన్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు, రేపు దిండి-చించినాడ వంతెనపై రాకపోకలు నిలుపుదల



మలికిపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దిండి-చించినాడ వంతెన మరమ్మతులు నిర్దేశిత గడువులోగా పూర్తి కాని దృష్ట్యా మరో 2 రోజుల పాటు వంతెనపై పూర్తిగా రాకపోకలు నిలుపుదల చేయనున్నట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వంతెన వద్ద బేరింగ్ రీప్లేస్ పనులు, ట్రాఫిక్ బ్లాక్ నియంత్రణ కోసం ఈ నెల 25, 26న ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు రాకపోకలను పూర్తిగా నిలుపుదల చేస్తున్నట్టు పేర్కొన్నారు. దిండి-చించినాడ 216 జాతీయ రహదారిపై పర్యటించే వాహనదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని, ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని కోరారు.

నేటి నుంచి సఖినేటిపల్లి రేవులో పంటు రాకపోకలు

అంతర్వేది, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వరదల నేపథ్యంలో 3 రోజుల పాటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి రేవులో పంటు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో సోమవారం నుంచి సఖినేటిపల్లి-నర్సాపురం రేవులో పంటు రాకపోకలు ప్రారంభంకానున్నాయి. ప్రయాణాలు సులభతరం అవుతాయని అధికారులు తెలిపారు.

31న రోటరీ డిస్ట్రిక్ట్ మెంబర్షిప్ సెమినార్

కాకినాడ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం దివాన్‌చెరువు సమీపంలోని ఎస్‌వీపీసీ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 31న రోటరీ డిస్ట్రిక్ట్ మెంబర్షిప్ సెమినార్‌ను డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ మెంబర్షిప్ కమిటీ చైర్మన్ చోడిశెట్టి పద్దరాజు తెలిపారు. కాకినాడ రోటరీ హాల్‌లో రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ప్రత్యేక సమావేశం ప్రెసిడెంట్ డాక్టర్ గోపీనాథ్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పద్దరాజు మాట్లాడుతూ సెమినార్‌కు కృష్ణా జిల్లా నుంచి శ్రీకాకుళం జిల్లా వరకు అన్ని రోటరీ క్లబ్‌ల సభ్యులు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా రోటరీ బ్లడ్ బ్యాంక్ కార్యదర్శి మాచారెడ్డి ప్రతిపాదించిన రవి సోలార్ ఇంజనీరింగ్ సంస్థ అధినేత రవీంద్రనాధ్‌రెడ్డికి రోటరీ సభ్యత్వం పిన్ను అందజేశారు. సమావేశంలో క్లబ్ కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ సానా, కోశాధికారి ఉదయచక్రవర్తి, సభ్యులు పాల్గొన్నారు.

పేకాడుతున్న పది మంది అరెస్ట్

కోరుకొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం దోసకాయలపల్లి తోటల్లో పేకాట శిబిరంపై దాడి చేసి పది మందిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ నాగార్జున ఆదివారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేశామన్నారు. 10 మందిని అరెస్ట్ చేసి రూ.41 వేలు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

కానుగ.. కొన ఊపిరితో నిలిచెగ!



కొన ఊపిరితో అంటూ అప్పుడప్పుడూ వింటుంటాం.. దానికి ఈ కానుగ వృక్షం తార్కాణంగా నిలిచింది. కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని వైఎస్ఆర్ నగర్‌లో నీడనిచ్చే కానుగ వృక్షాన్ని విద్యుత్ సిబ్బంది కొమ్మలకు బదులు మొదలు నరికేశారు. కాండం మొత్తం తెగిపడగా బెరడు మాత్రం మిగిలిఉంది. ఆ బెరడు(కొన)తో కానుగ వృక్షం చిగిరించింది. కొన ఊపిరితో (జీవించడం) చిగురించిం చడం ఇదేనేమో.. ఈ వృక్షం చూపరులను ఆశ్చర్యపరుస్తుంది..

ఆంధ్రజ్యోతి, -రామచంద్రపురం (ద్రాక్షారామ)

గుర్తుకొస్తున్నాయి...

రామచంద్రపురంలో...



కొత్తపేటలో...



50 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల కలయిక

రామచంద్రపురం(ద్రాక్షారామ)/కొత్తపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం వీఎస్ఎం కళాశాలలో 1975 నుంచి 78 వరకు బీఎస్సీ విద్యను అభ్యసించిన 50 ఏళ్ల తర్వాత కలిశారు. ఆదివారం బుచ్చిరాజు కల్యాణవేదికపై అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయురాలు కె.నాగరాజకుమారిని సత్కరించారు. వీఎస్ఎం ప్రిన్సిపాల్ అన్సారీ, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకుడు కామేశ్వరరావు, డా.చెలికానిస్టాలిన్ వారికి అభినందనలు తెలిపారు. పూర్వవిద్యార్థులు హైకోర్టు న్యాయ వాది సార్వభౌమారావు, విశ్రాంత న్యాయమూర్తి కామేశ్వరి దంపతులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అలాగే కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1972-74 మధ్య ఇంటర్ చదువుతున్న అప్పటి విద్యార్థులు సుమారు 50 ఏళ్ల తరువాత ఆదివారం కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కలుసుకున్నారు. పాతజ్ఞాపకాలు గుర్తుకుతెచ్చుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పట్లో ఇక్కడ చదివిన విద్యార్థిని యూఎస్ఏలో డాక్టర్‌గా పనిచేస్తుండగా ఆ దంపతులను, ఇక్కడ అధ్యక్షుడిగా కార్యక్రమాలు నిర్వహించిన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం- అనంతకుమారి దంపతులను పూర్వపు విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏబీ భాణి, కె.ప్రసాదవర్మ, పప్పుల వీరభద్రరావు, సత్యవరపు సత్యనారాయణ, ముత్యాల మాధవరావు, కేతినీడి సత్యనారాయణమూర్తి, పెంటా భాస్కరరావు, జి.కృష్ణ, ఆర్.రామారావు, కె.రాజేశ్వర్, అక్కిరెడ్డి వెంకటేశ్వరరావు,భీమాల వెంకటేశ్వరరావు ఉన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

మరిడమ్మ ఆలయంలో నేడు హుండీల లెక్కింపు

పెద్దాపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మరిడమ్మ ఆలయంలోని హుండీలను సోమవారం లెక్కిస్తామని సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి తెలిపారు. దేవదాయ శాఖ అధికారులు, ఫౌండర్ ట్రస్టీ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారుల సమక్షంలో లెక్కింపు ప్రక్రియ జరుగుతుందన్నారు.



జేవీవీ కాకినాడ జిల్లా నూతన కమిటీ సభ్యులు

జన విజ్ఞాన వేదిక జిల్లా నూతన కమిటీ ఎన్నిక

కాకినాడ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక కాకినాడ జిల్లా మహాసభలు ఆదివారం నగరంలోని యూటీఎఫ్ హోంలో విజయవంతంగా జరిగాయి. జిల్లా గౌరవాధ్యక్షుడు వి.సత్యనారాయణరెడ్డి జేవీవీ పతాకావిష్కరణ చేశారు. గత రెండు సంవత్సరాల కార్యక్రమలపై సమీక్షించి, రాబోయే రెండు సంవత్సరాలకు నూతన కమిటీని ఎన్నుకున్నారు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కేఎంఎంఆర్ ప్రసాద్, జీఎస్‌హెచ్ ప్రసాదవర్మ, కోశాధికారిగా పి.బాలాజీ ఎన్నికయ్యారు. రాష్ట్ర పరిశీలకుడిగా విచ్చేసిన కె.త్రిమూర్తులు మాట్లాడుతూ సమాజంలో జేవీవీ ఆవశ్యకత ఎన్నడూ లేనంతగా ఇప్పుడు పెరిగిందన్నారు. దానికి తగ్గట్టుగా జిల్లా కమిటీ కార్యక్రమాలను రూపొందించుకుని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిబాబు, ఏపీఆర్ఎంఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు కె.సత్తిరాజు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి రమణి ప్రసంగించారు. పది మండలాల నుంచి 50 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

'శాస్త్రీయ సమాజ నిర్మాణానికి కృషి'

గొల్లప్రోలు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆలోచనా విధానాలు మార్పు తెచ్చి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రతినిధులు ఎస్.సూర్యనారాయణ, వి.సత్యనారాయణరెడ్డి సూచించారు. గొల్లప్రోలు మెయిన్‌రోడ్డులో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ శాస్త్రీయ అవగాహన పెంచాలని కోరారు. అనంతరం జేవీవీ గొల్లప్రోలు పట్టణ, మండల కమిటీల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. గౌరవాధ్యక్షుడిగా దాడి పద్మనాభం, అధ్యక్షుడిగా ఏలేటి నానిబాబు, ఉపాధ్యక్షుడిగా ఎంవీ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా దాసం గోవిందరాజులు, చెకుముకి కన్వీనర్‌గా అనిశెట్టి సీతారామరాజు ఎన్నికయ్యారు. సమావేశంలో సమత జిల్లా కన్వీనర్ చల్లా ఉమారాజమంగతాయారు, సీహెచ్ లోవరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జేవీవీ ప్రతినిధులు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్

చిన్నారులకు ఉచిత గుండె వ్యాధి నిర్ధారణ శిబిరం

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, శ్రీసత్యసాయి ట్రస్ట్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ భాగస్వామ్యంతో వలసపాకలలోని కోరమాండల్ ఆసుపత్రి ప్రాంగణంలో ఆదివారం చిన్నారులకు ఉచిత గుండె వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. దీనిని ముఖ్య అతిథిగా హాజరైన డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ ప్రారంభించారు. 105 మంది చిన్నారులు, 280 మంది పెద్దలకు గుండె సంబంధ వైద్య పరీక్షలు జరిపారు. 34 మంది చిన్నారులకు శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. వచ్చే నెలలో సిద్దిపేటలోని శ్రీసత్యసాయి ట్రస్ట్ ఆసుపత్రిలో పూర్తిగా ఆపరేషన్ చేస్తారు. పెద్దలకు సత్యసాయి ట్రస్ట్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు గుండె పరీక్షలు చేసి అవసరమైన మందులు ఇచ్చారు. కోరమాండల్ యూనిట్ హెడ్ అధ్యక్షత వహించారు. కోరమాండల్ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది, ట్రస్ట్ మల్టీ స్పెషాలిటీస్ హాస్పిటల్ గుండె నిపుణులు, ఇతర సిబ్బంది కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో భాగస్వాములయ్యారు.



ప్రమాణం చేస్తున్న అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక

సామర్లకోట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండల ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా వేము శ్రీనివాసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ కార్యవర్గ సమావేశం, కార్యవర్గ ఎన్నికలను ఆదివారం గుణ్ణం చంద్రమౌళి ఫౌండేషన్ ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా కరక రామకృష్ణ, కోశాధికారిగా పేకేటి శేషబాబు, ఉపాధ్యక్షుడిగా జిత్తుక శేఖర్, ఉప కార్యదర్శిగా అడపా వెంకీ, సభ్యులుగా పాలక జయబాబు, మేడిశెట్టి లోవరాజు, పలివెల వెంకటరమణ, రెడ్డిమల్లి జానీ, ద్వారంపూడి వీరేంద్ర ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వహణాధికారిగా వ్యవహరించిన కాకినాడ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు తోట సూర్యసుబ్బారావు ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు ప్రమాణం చేశారు. నూతన కార్యవర్గాన్ని సంఘ సభ్యులైన పలువురు ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు పూలమాలలతో అభినందించారు.



విద్యార్థినులకు ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

పేద విద్యార్థినులకు ఆర్థిక సాయం

కాకినాడ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గం చిత్రాడ గ్రామానికి చెందిన యు.హరిణి, యు.గీతిక తండ్రి ఈ నెల 6న గుండెపోటుతో మరణించారు. దీంతో నర్సింగ్ జీఎన్ఎం కోర్సు చేస్తున్న హరిణి, డీఎడ్ స్పెషల్ టీచర్ కోర్సు చేస్తున్న గీతిక చదువుకు ఆటంకం ఏర్పడడంతో శ్రీయువసేనను ఆశ్రయించారు. వారికి ఒక్కొక్కరికి రూ.20వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని కాకినాడకు చెందిన డాక్టర్ డి.అనిల్ కృష్ణారెడ్డి, డాక్టర్ భువనేశ్వరి దంపతులు ఆదివారం బ్లడ్ బ్యాంక్‌కు విచ్చేసి అందజేశారు. విద్యార్థినులతో డాక్టర్ భువనేశ్వరి పుట్టినరోజు కేక్ కట్ చేయించి శాలువాతో సత్కరించి వేంకటేశ్వర స్వామి ఫొటో, జ్ఞాపికలను శ్రీయువసేన బ్లడ్ బ్యాంక్ అధ్యక్షుడు బొల్లం సతీష్ అందజేశారు.

ఏలేరు బల్లకట్టు వద్ద మరలా గండి

కొట్టుకుపోయిన ఇసుక బస్తాలు

గొల్లప్రోలు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు వద్ద గల బల్లకట్టుకు గత ఏలేరు వరదలకు పడిన భారీ గండిని ఇటీవల ఇసుక బస్తాలతో తాత్కాలికంగా రింగ్ బండ్ నిర్మించి పూడ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఏలేరు నీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో ఇసుక బస్తాల్లో కొన్ని కొట్టుకుపోయి మరలా గండిపడింది. ఈ నేపథ్యంలో నీరు వృథాగా కిందికిపోతోంది. బల్లకట్టుకు పడిన గండిని శాశ్వతప్రాతిపదికన పూడ్చేందుకు ఇరిగేషన్ శాఖ రూ.47లక్షలతో ప్రతిపాదనలు రూపొందించారు. నాలుగేళ్ల క్రితం అప్పటి జిల్లా కలెక్టర్ సీఎస్ఆర్ నిధుల నుంచి మంజూరు ఇచ్చి పనులు చేపట్టాలని ఆదేశించారు. అయితే కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు జరగలేదు. 2024 ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వచ్చిన వరదలకు ఈ గండి మరింత పెద్దదైంది. అప్పుడైనా శాశ్వత ప్రాతిపదిన పనులు చేపడతారని ఆశించినా చేపట్టలేదు. తాత్కాలికంగా ఇసుక బస్తాలతో రింగ్‌బండ్లు నిర్మించి చేతులు దులుపుకున్నారు. దీంతో సాధారణ వర్షాలకు ఇసుక బస్తాలు కొట్టుకుపోయి మరలా గండి ఏర్పడింది. శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



ఏలేరు కాలువపై గొల్లప్రోలు బల్లకట్టు గండి వద్ద వేసిన ఇసుక బస్తాలు కొట్టుకుపోవడంతో వృథాగా పోతున్న నీరు



1.కొత్త కాలనీకి వెళ్లే రహదారి కోతకు గురై కొట్టుకుపోయిన దృశ్యం 2. రహదారిపై గ్రావెల్ వేసి మరమ్మతులు నిర్వహిస్తున్న దృశ్యం 3. ప్రారంభమైన రాకపోకలు

కొత్త కాలనీ రహదారికి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

గొల్లప్రోలు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సుద్దగడ్డ వరదలతో పట్టణ శివారు కొత్త కాలనీకి వెళ్లేందుకు నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పక్కనే ఏర్పాటుచేసిన ప్రత్యామ్నాయ రహదారి ఛిన్నాభిన్నమైంది. రోడ్డు పూర్తిగా ముంపులో చిక్కుకుకోవడంతో పది రోజులుగా కాలనీ ప్రజలు నిచ్చెన ఎక్కి బ్రిడ్జిని దాటి కాలనీకి చేరుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరద తగ్గిన తర్వాత రోడ్డు పలుచోట్లు కొట్టుకుపోవడంతో పాటు కోతకు గురైనట్టు గుర్తించారు. దీంతో అధికారులు తక్షణం స్పందించి కోతకు గురై, కొట్టుకుపోయిన రోడ్డుపై గ్రావెల్ వేసి మరమ్మతులు చేపట్టారు. ఈ పనులు పూర్తికావడంతో ప్రత్యామ్నాయ రహదారిపై రాకపోకలు ప్రారంభమయ్యాయి. దీంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సేవా కార్యక్రమాల్లో క్షత్రియ పరిషత్ మహిళా విభాగం ముందంజ

కాకినాడ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తమ సభ్యుల సహాయ సహకారాలు, సీనియర్ సభ్యుల సలహాలు, సూచనలతో పరిషత్ మహిళా విభాగాన్ని అన్ని విధాలా ముందుకు తీసుకెళ్తున్నామని కాకినాడ క్షత్రియ పరిషత్ మహిళా విభాగం అధ్యక్షురాలు పెన్మత్స పార్వతి పేర్కొన్నారు. క్షత్రియ పరిషత్ మహిళా విభాగం 6వ వార్షికోత్సవ వేడుకలను గాంధీనగర్‌లోని పరిషత్ కమ్యూనిటీ హాలులో ఆదివారం నిర్వహించారు. పేద క్షత్రియ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ, వినాయక చవితి సందర్భంగా సభ్యులకు మట్టి వినాయక ప్రతిమల పంపిణీ, కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మహిళలకు వైద్య శిబిరం ఏర్పాటుచేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మహిళలు తమ వ్యాపార ఉత్పత్తులను ప్రదర్శించారు. అధ్యక్షురాలితో పాటు మహిళా విభాగం కార్యదర్శి ఇందుకూరి దేవివర్మ మాట్లాడారు. ముఖ్య అతిథిగా హాజరైన చైతన్య విద్యా సంస్థల వైస్ చైర్‌పర్సన్ కలిదిండి బదరీలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు ఇంటి పనులే కాకుండా వివిధ రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన వీఎస్ లక్ష్మి విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేగేశ్న సంధ్య మాట్లాడుతూ క్షత్రియ పరిషత్ మహిళా విభాగం తొలి అధ్యక్షురాలిగా తాను అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించానన్నారు అనంతరం సీనియర్ సభ్యులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు దాట్ల పార్వతి, శ్రీవత్సవాయి లక్ష్మీదేవి, శేషకుమారి, దాట్ల శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



వార్షికోత్సవంలో పాల్గొన్న మహిళా సభ్యులు

సీహెచ్‌సీలో భవనాల తొలగింపు

పూర్తి కాగానే 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభం

పిఠాపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (ప్రభుత్వాసుపత్రి)లో భవనాల తొలగింపును ఆదివారం చేపట్టారు. సీహెచ్‌సీని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు రూ.39కోట్ల వ్యయంతో నూతన భవనాల నిర్మాణానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇప్పటికే శంకుస్థాపన చేశారు. నూతనంగా నిర్మించే భారీ భవనాల కోసం ప్రస్తుతం ఆసుపత్రి ఆవరణలో ఉన్న భవనాలను తొలగించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా శిథిలావస్థకు చేరిన పాత ఇన్‌పేషెంట్ వార్డుల భవనాలతో పాటు రోగులు వేచి ఉండేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణం ప్రారంభించి అసంపూర్తిగా ఉండిపోయిన భవనం, సుమారు రూ.5లక్షలకు పైగా వెచ్చించి దాతలు నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంట్, భవనాలను తొలగించే పనులను ఆదివారం ప్రారంభించారు. దాతలు ఇచ్చిన ఆర్వో ప్లాంటు కోసం పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ నూతనంగా మరో భవనాన్ని నిర్మించారు. అందులోకి ఈ వాటర్ ప్లాంటును మార్పు చేయనున్నారు. గత 15ఏళ్ల కాలంలో క్రమ పద్ధతి లేకుండా నిర్మాణాలు చేపట్టడంతో ఇప్పుడు వాటిని తొలగించాల్సి వస్తోందని అధికారులు తెలిపారు. మూడు, నాలుగు రోజుల్లో భవనాల తొలగింపు పూర్తవుతుందని వారు చెప్పారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే కొత్త భవనాల నిర్మాణం ప్రారంభిస్తామని తెలిపారు.



ఆసుపత్రిలోని ఓ భవనాన్ని ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న దృశ్యం

నేడు పిఠాపురంలో జైగణేష్ మాలధారణ

నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ

పిఠాపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటగుమ్మం సెంటర్లో కొలువైయున్న జైగణేష్ దేవస్థానంలో సోమవారం జైగణేష్ మాలధారణ జరగనున్నది. 11 రోజుల పాటు జైగణేష్ దీక్ష చేపట్టే భక్తులకు స్వామి సమక్షంలో మాలధారణ గావిస్తారు. సెప్టెంబరు 5వ తేదీ వరకు దీక్ష కొనసాగుతుంది. 4న ఇరుముడిధారణ, గణేష్‌స్వాముల నగరోత్సవం, 5న ఇరుముడి సమర్పణ ఉంటాయి. నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు జరుగుతాయి. సోమవారం తెల్లవారుజామున మాలధారణ, నవరాత్రి ఉత్సవాలకు అంకుర్పారణ జరుగుతుంది. తొలుత విఘ్నేశ్వర పూజ, ధ్వజారోహణం, స్వామికి అభిషేకాల అనంతరం గణేష్ దీక్ష మాలధారణ జరుగుతాయి. 27వ తేదీ ఉదయం స్వామివారికి పట్టువస్త్రాల సమర్పణ, 11 రకాల ద్రవ్యాలతో అభిషేకం, సాయంత్రం మూషిక వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని ఈవో నున్న శ్రీరాములు, ప్రధానార్చకుడు మైలవరపు రామకృష్ణ కోరారు.



పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలతో కలిసి సైకిల్ తొక్కుతున్న కమాండెంట్ నాగేంద్రరావు

'శారీరక, మానసిక ఆరోగ్యాలకు సైక్లింగ్ దోహదం'

సర్పవరం జంక్షన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక ఆరోగ్యాలకు సైక్లింగ్ ఎంతో దోహదం చేస్తుందని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ఎం.నాగేంద్రరావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఏపీఎస్పీ క్యాంపులో 'సండే ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో ప్రతి ఆదివారం సైక్లింగ్, యోగ, స్కిప్పింగ్, జుంబ డాన్స్ నిర్వహించాలని డీజీపీ ఆదేశించారన్నారు. ఈ మేరకు ఏపీఎస్పీ బెటాలియన్ నుంచి నాగమల్లితోట జంక్షన్ వరకు అధికారులు, సిబ్బందితో కలిసి కమాండెంట్ సైకిలు తొక్కారు. అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్లు మోహన్‌రావు, చంద్రశేఖర్, ఆర్ఐ అజయ్‌కుమార్, విఠలేశ్వరరావు, ఏఎస్ ఐ. రాజు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



నిత్యాన్నదాన పథకానికి విరాళం అందజేసిన దాతలను సత్కరిస్తున్న దృశ్యం

నిత్యాన్నదాన పథకానికి విరాళం

సామర్లకోట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో నిత్యాన్నదాన పథకానికి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన జోశ్యుల వెంకటసోమయాజులు పేరిట రూ.50,014 విరాళాన్ని జోశ్యుల సుబ్బలక్ష్మి... ఈవో బళ్ళ నీలకంఠానికి అందజేశారు. తొలుత సుబ్బలక్ష్మి, కుటుంబ సభ్యులు భీమేశ్వరస్వామిని, బాలాత్రిపురసుందరి అమ్మవార్లను దర్శించారు. నంది మండపం వద్ద సుబ్బలక్ష్మికి వేదాశీర్వచనంతో ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని ఈవో అందజేశారు.



సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జడ్పీటీసీ రామకృష్ణ

కురసాల సత్యనారాయణకు నివాళి

సర్పవరం జంక్షన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ జడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ (కిట్టూ) ఆధ్వర్యంలో ఆదివారం కృషి భవన్‌లో మాజీ మంత్రి కన్నబాబు తండ్రి సత్యనారాయణ సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సత్యనారాయణతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వైసీపీ నాయకులు బెజవాడ సత్యనారాయణ, పుల్ల చందూ, వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి, కడియాల చిన్న, కర్రి చక్రధర్, రాజు, కరీంబాషా తదితరులు పాల్గొన్నారు.



జి.రాగంపేటలో పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజప్ప, డీసీసీబీ చైర్మన్ బాబు

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

పెద్దాపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామం స్వచ్ఛ గ్రామంగా రూపుదిద్దుకోవాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) పేర్కొన్నారు. మండలంలోని జి.రాగంపేటలో రూ.18లక్షలతో నిర్మించిన మదర్‌థెరిస్సా పార్కు, రూ.3లక్షల వ్యయంతో నిర్మించిన వెహికల్ షెడ్డును వారు ఆదివారం ప్రారంభించారు. ఎంపీపీ పెంకే వెంకటలక్ష్మి, ఎంపీడీవో డి.శ్రీలలిత, సర్పంచ్ శేఖర్‌బాబు, ఏఎంసీ డైరెక్టర్ జలాని సుబ్రహ్మణ్యం (బాబీ), కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

'సీఎం పర్యటనతో పెద్దాపురానికి ఒరిగింది ఏమీ లేదు'

పెద్దాపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటనతో పట్టణానికి ఒరిగింది ఏమీ లేదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నీలపాల సూరిబాబు ఆరోపించారు. వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆస్తుల ప్రైవేటీకరణ ప్రకటనకే సీఎం పర్యటన సాగిందన్నారు. మంచినీటిని ఏలేరు నుంచి అందజేస్తామని చేసిన ప్రకటపై చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. సీపీఎం నాయకులు సిరిపురపు శ్రీనివాస్, రొంగల వీర్రాజు, సుబ్బలక్ష్మి, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా కాలనీ పార్కును పట్టించుకోండి సారూ...!

కాకినాడ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జగన్నాథపురం 24వ డివిజన్ ఇందిరా కాలనీ పార్కు ఆవరణ చెత్త, పిచ్చి మొక్కలు, పశువుల సంచారంతో దుర్భర స్థితికి చేరింది. లక్షల రూపాయలు వెచ్చించి ఈ పార్కులో నిర్మించిన జిమ్ ఎక్విప్ మెంట్, లైబ్రరీ నిరుపయోగంగా పడి ఉన్నాయి. దీంతో అల్లరిమూకలు చేరి మద్యం సేవించడం వంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఈ పార్కు దుస్థితిపై అధికారులు దృష్టి సారించి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని దళిత, గిరిజన, బీసీ, ముస్లిం, క్రైస్తవ ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డోకుబుర్ర భద్రం మాస్టారు కోరారు.



చెత్త, పిచ్చి మొక్కలతో అధ్వానంగా వున్న ఇందిరా కాలనీ పార్కు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):సోమవారం 11కేవీ నరేంద్ర పట్నం ఫీడర్‌లో ఆర్‌డీఎస్ఎస్ వర్క్ కారణంగా ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ ఈఈ వీరభద్రరావు తెలిపారు. గొల్లలగుంట, గుర్రంపాలెం, బావవరం, కాండ్రేగుల గ్రామాలకు, బోరులకు, బావవరం వాటర్‌ప్లాంట్‌కి విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

‘రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి’



సమావేశంలో పాల్గొన్న ఐక్యసాధన కమిటీ నాయకులు

రంపచోడవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయాలని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి ఆధ్వర్యం లో ఆదివారం ప్రత్యేక జిల్లా సాధన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజమండ్రి వద్దు రంపచోడవరం ముద్దు అని రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లాను ఏర్పాచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐక్య సాధన కమిటీ నాయకులు బందం శ్రీదేవి, పండా వెంకటలక్ష్మి, మట్ల వాణిశ్రీ, తీగల బాబురావు, బోండ్ల వరప్రసాదరావు పాల్గొన్నారు.

ఐక్యతతోనే రంపచోడవరం జిల్లా సాధన

● ఆదివాసీ సంఘం



సమావేశంలో పాల్గొన్న ఆదివాసీలు

అడ్డతీగల, (వై.రామవరం), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం నియోజకవర్గం 11 మండలాల ప్రజలు కులమతాలకు అతీతంగా పోరాటం చేస్తేనే రంపచోడవరం జిల్లా సాధించుకోవచ్చని ఆదివాసీ ఉద్యోగ సంక్షేమ సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు కత్తుల ఆదిరెడ్డి అన్నారు. ఆదివారం అడ్డతీగలలో ఆదివాసీ భవనంలో ప్రత్యేక జిల్లా అవశ్యకతపై అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశంలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు మాట్లాడుతూ రంపచోడవరం జిల్లా సాధనకు ప్రత్యేక ప్రణాళిక తో ముందడుగు వేయాలని దీనికి ఉద్యోగస్తుల నుంచి పూర్తి సహకారం ఉండాలని, తన వంతు సహాయాన్ని కూడా అందిస్తామన్నారు. జిల్లా సాధనపై పలువురు నేతలు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నేతలు బొగ్గుల కాటమ్ రెడ్డి, బోడారపు కృష్ణ, పరిశిక ప్రకాశరావు, మాజీ ఎంపీపీ అన్నం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో అడ్డంకిగా ఇసుక లారీలు



పురుషోత్తపట్నం వరకు నిలిపి ఉన్న ఇసుక లారీలు

ఎటపాక, ఆగస్టు 24(ఆంధ్ర జ్యోతి) రాష్ట్ర సరిహద్దులోని పురుషోత్తపట్నం వద్ద విజయ వాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై నిలిపిన ఇసుక లారీలు వాహన రాకపోకలకు అడ్డంకిగా మారాయి. చత్తీస్‌గడ్ రాష్ట్రం నుంచి ఇసుక లోడ్‌తో తెలంగాణ ప్రాంతానికి రవాణా అవుతున్న ఇసుకను సరిహద్దులోని భద్రాచలం పట్టణ శివారులో ఉన్న కొల్లుగూడెం ర్యాంపులోని వేబ్రిడ్జి వద్ద ఇసుక బరువును లెక్కిస్తున్నారు. ఆ తర్వాత ఇసుక లారీలు తెలంగాణకు తరలివెళ్తున్నాయి. ఇసుక లారీలను ఏపీ పరిధిలో పురుషోత్తపట్నం వరకు జాతీయ రహదారిపై నిలిపి ఉంచడంతో ఇటువైపుగా వాహనరాకపోకలు సాగించే వారికి అడ్డంకిగా మారుతున్నాయి. రెండు, మూడు రోజులుగా ఇసుక లారీలు జాతీయ రహదారిపై ఉంచడంతో వాహనదారులు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయపై సీఐ కన్నపరాజు వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి రాలేదని వెంటనే ఏపీ పరిధిలో జాతీయ రహదారిపై ఉన్న ఇసుక లారీలను తొలగిస్తామని చెప్పారు.

వరద ప్రాంతాలలో మాజీ ఎమ్మెల్యే పర్యటన



వడ్డిగూడెంలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

వీఆర్‌పురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) ఇటీవల గోదావరి వరదల కారణంగా ముంపునకు గురైన గ్రామాలలో రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పర్యటించారు. ముందుగా మండల పరిధిలోని వడ్డిగూడెం, వడ్డిగూడెం కాలనీ, శ్రీరామగిరి గ్రామాలలో ఆమె పర్యటించారు. ఈసందర్భంగా ఆమె వరద బాధితులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వరద బాధితులకు నిత్యావసర సరకులు పూర్తిస్థాయిలో అందించాలని ఆమె అన్నారు. ఆమె వెంట మండల వైసీపీ నాయకులు మాదిరెడ్డి సత్తిబాబు, చిక్కాల బాలు, మాచర్ల గంగులు ముత్యాల గౌతమ్, ఎంపీటీసీ ముత్యాల భవాని, బొడ్డు సత్యనారాయణ, వెంగళరావు పాల్గొన్నారు.

‘వరద బాధితులను ఆదుకోవాలి’

కూనవరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):ఇటీవల వచ్చిన వరదల కారణంగా ముంపునకు గురైన వరద బాధితులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి అన్నారు. వరదకు ముంపునకు గురైన ఉదయ్‌భాస్కర్ కాలనీలో ఆమె పర్యటించారు. ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు ఆలూరు కోలయ్య, జడ్పీటీసీ విజయ, జగ్గవరం సర్పంచ్ పార్వతి, కొమ్మని మోహన్ రావు, నాయకులు బత్తుల వెంకటేష్ సునీత శివరాం తదితరులు పాల్గొన్నారు.

గిరిజన నిరుద్యోగులకు ఉపాధి కల్పించండి

మోతుగూడెం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మన్యం ప్రాంతంలో ఉన్న గిరిజన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించాలని గొండ్వానా పరిషత్ తీర్మానించింది. పరిషత్ సమావేశంలో మోతుగూడెం ఎస్టీకాలనీలో ఆదివారం సమావేశం జరిగింది. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించడానికి ఐటీడీఏ చర్యలు తీసుకోవాలని కోరింది. సమావేశంలో న్యాయవాది ఆత్రం నవీన్, అసు దుర్గాప్రసాద్, మాజీ సర్పంచ్ కారం బాబు పాల్గొన్నారు.

శిథిలావస్థలో గమలకోట పాఠశాల

● భయం గుప్పెట్లో విద్యార్థులు

మోతుగూడెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం చదలవాడ పంచాయతీ గమలకోట గ్రామంలో గిరిజన చిన్నారుల చదువులు భయం గుప్పెట్లో సాగుతున్నాయి. శిథిలావస్థకు చేరిన భవనాల్లో బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నారు. చదలవాడ పంచాయతీ గమలకోట ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. వర్షాలతో తరగతి గది చిత్తడిగా మారింది. స్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. అధికారులు స్పందించి కొత్త భవనంగాని భవనం మరమ్మతులకు చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



వర్షంపు నీటితో తరగతి చిత్తడిగా మారిన తరగతి గదులు

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

తాళ్లూరు లిఫ్ట్‌కు రూ.52కోట్ల నిధులు మంజూరు

● జీవోను ఎమ్మెల్యే జ్యోతులకు అందజేసిన సీఎం



జీవో ప్రతులను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

జగ్గంపేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట నియోజకవర్గంలో కీలకమైన పుష్కర ఎత్తిపోతల పథకం అంతర్భాగం. తాళ్లూరు లిఫ్టుకు ప్రభుత్వం రూ.52కోట్లు నిధులు మంజూరుచేస్తూ క్యాబినెట్ ఆమోదించి ఆ పత్రాలను సీఎం చంద్రబాబు ఉండవల్లిలోని ఆయన నివాసంలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే నెహ్రూ, పుష్కర ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అడబాల భాస్కరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భారత్, గండేపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు పోతుల మోహన రావు, అబివృద్ధి కమిటీ డైరెక్టర్లు మారిశెట్టి భద్రం, కందుల చిట్టిబాబు తదితరులు ముఖ్యమంత్రిని ఘనంగా సత్కరించి వెంకటేశ్వరస్వామి ప్రతిమను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో పైపులైన్లు మరమ్మతుకుగురై మూలనపడ్డ ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు ఊపిరిపోసి పుష్కర ఎత్తిపోతల పథకం తాళ్లూరు లిఫ్టకు పైపులైన్ల మార్పునకు ఆమోదముద్రవేసి రూ.52కోట్లతో పరిపాలన ఆమోదం ఇచ్చే ప్రతిపాదనకు, పనులు ప్రారంభించేందుకు పచ్చ జెండా ఊపిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేసేందుకు విచ్చేశామని ఆయకట్టుకు రైతులు సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటారని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు.

ఏలేశ్వరం చైర్ పర్సన్‌పై అవిశ్వాసానికి వైసీపీ కౌన్సిలర్ల సంతకాల సేకరణ

ఏలేశ్వరం, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరంలో టీడీపీకి చెందిన నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతిపై అవిశ్వాస తీర్మానం ప్రకటించేందుకు వైసీపీ విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ఈమేరకు వైసీపీ కౌన్సిలర్లు సంతకాలు సేకరించి వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేసేందుకు సిద్ధమవుతున్నారు. ఏలేశ్వరంలో పరిపాలన సజావుగా జరగడం లేదని ప్రతిపక్షపార్టీ ఈవిధంగా తీర్మానం కోరేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. నాలుగేళ్లక్రితం జరిగిన పురపాలక ఎన్నికల్లో వైసీపీ 16, టీడీపీ 4 స్థానాల్లోను సభ్యులు గెలిచారు. అప్పట్లో వైసీపీకి చెందిన సత్యవతిని చైర్‌పర్సన్‌గా ఎంపిక చేశారు. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎన్నికల ముందు చైర్‌పర్సన్ మరో ఐదుగురు కౌన్సిలర్లు తెలుగుదేశంలో చేరారు. నగర పంచాయతీలో మొత్తం 20 వార్డులు ఉండగా టీడీపీ 9, వైసీపీకి 9మంది కౌన్సిలర్లు మద్దతుదారులు ఉన్నారు. 20వ వార్డుకు చెందిన మసిరపు బుజ్జి జనసేన, 7వ వార్డుకు చెందిన పైల వెంకట ప్రియ దీప్తి బీజేపీలో చేరి కౌన్సిలర్లుగా వ్యవహరిస్తున్నారు. అవిశ్వాస తీర్మానానికి కలెక్టర్ అనుమతి ఇస్తే సమావేశం నిర్వహించే అవకాశం ఉంది. వైసీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబును వైసీపీ కేడర్ కలిసి విషయం వివరించారని దానికి ఇంచార్జ్ సరే అనడంతో సంతకాలు సేకరణ ముమ్మరం చేసి గద్దెనెక్కడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మండలంలోని ఒమ్మంగి గ్రామంలో వి.లక్ష్మికన్వెన్షన్ ఫంక్షన్ హాల్లో ఆదివారం సాయంత్రం వైసీపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసిన ప్రజలు ఆలోచనలో పడ్డారని, కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన 146 హామీలలో అత్యధికం విస్మరించిన వ్యవహారం ప్రజలు గమనిస్తున్నారన్నారు. నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతోనే తమ తండ్రి ముద్రగడ పద్మనాభం అనారోగ్యం నుంచి కోలుకుని ఆరోగ్యంగా అడుగులు వేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గీయులకు ఏకష్టం వచ్చినా అండగా ఉంటానని గిరిబాబు తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, పార్టీ నాయకులు రామిశెట్టి నాని, సానా నూకరాజు నాయుడు, దొడ్డిపట్ల సోమన్న దొర, జలిగంపల ప్రభాకరరావు, దోళే చిట్టిబాబు, బొడ్డేటి రాయుడు, గుడాల వెంకటరత్నం పాల్గొన్నారు.

టీడీపీలో కష్టపడి పనిచేసేవారికే గుర్తింపు

● ఎమ్మెల్యేకు సత్రం పాలక వర్గం సత్కారం

ప్రత్తిపాడు/రౌతులపూడి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందని, అందుకు నిదర్శనం కత్తిపూడి సత్రం చైర్మన్ పదవిని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ నియమించడమేనని కత్తిపూడి సత్రం చైర్మన్ సోమరౌతు చంద్రమౌళి అన్నారు. మండలంలోని గ్రామాల్లో టీడీపీ నేతలతో ప్రత్తిపాడు తరలివెళ్లి ఎమ్మెల్యే సత్యప్రభను మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను ఆదివారం కత్తిపూడి రాజావత్సవాయి బుచ్చి సీతాయమ్మ, జగపతి బహదూర్ మహారాణి సత్రం పాలకవర్గ చైర్మన్ సోమరౌతు చంద్రమౌళి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. శంఖవరం, రౌతులపూడి మండలాల నుంచి వారంతా మండలంలోని పెదశంకర్లపూడి టీడీపీ కార్యాలయానికి నాయకులు, కార్యకర్తలతో కలిసి వచ్చారు. నూతన పాలకవర్గంలో నియమితులైన చైర్మన్ మౌళితోపాటు సభ్యులు కృతజ్ఞతగా ఎమ్మెల్యే సత్యప్రభను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, ఎంపీపీ గంటుమళ్ల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కర రావు, సొసైటీ అధ్యక్షుడు పైల పైడిరాజు, ఎంపీటీసీ సోమరౌతు రవి, కోసూరి కృష్ణవర్మ, లాలం అప్పల నాయుడు, సింహాద్రి పెదబాబు, జేట్టా రాజా, లెక్కల రాము, పనగడుగు రమణ, గుండ్రాజు దివాణం, తండపురెడ్డి అప్పారావు, ఈగల సత్తిబాబు పాల్గొన్నారు.



పెదశంకర్లపూడిలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను సన్మానిస్తున్న కత్తిపూడి సత్రం నూతన పాలక వర్గ సభ్యులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి గుంటూరు జిల్లా నరసరావుపేట పార్లమెంటుజిల్లా అధ్యక్ష, అనుబంధ విభాగాలకు సంబంధించిన టీడీపీ సంస్థాగత ఎన్నికలకు పరిశీలకుడిగా జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. ముందుగా అక్కడికి చేరుకున్న నెహ్రూకు ఘన స్వాగతం పలికారు. అనంతరం సంస్థాగత ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ దేశంలోనే కోటి మందికిపైగా క్రియాశీలక సభ్యుల ఏకైక పార్టీ టీడీపీ అని పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒక్కసారి పార్టీ పదవులకు ఎన్నికలు నిర్వహిస్తామని, ఈరోజు పార్టీలో పదవులు తీసుకున్న ప్రతిఒక్కరూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అఖండ విజయం సాధించేందుకు కృషి చేయాలన్నారు. ప్రత్తిపాటి పుల్లారావు, కన్నా లక్ష్మీనారాయణ, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకల నారాయణ, రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ చైర్మన్, జోన్2 కోఆర్డినేటర్ మండలపు రవి, నరసరావుపేట జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మణి బాబుకి సత్కారం

జగ్గంపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేవీఆర్ అపార్ట్‌మెంట్ వద్ద జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘ అధ్యక్షుడు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొ రేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు), సంఘ పెద్దలు కలిసి జగ్గంపేట మండల టీడీపీ అధ్యక్షు డు జీను మణిబాబుని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తకొండ బాబు మాట్లాడుతూ జ్యోతుల నెహ్రూ ఆశీస్సులతో జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సహకారంతో మండల టీడీపీ అధ్యక్షుడిగా నియమితులైన జీను మణిబాబుని ఘనంగా సత్కరించామని ఆయన ఆధ్వర్యంలో ఆర్యవైశ్య లలో పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే విధంగా ఎమ్మెల్యే నెహ్రూ సహకారంతో ఇళ్ల స్థలం ఇప్పించాలని కోరారు. మణిబాబు మాట్లాడు తూ రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్తకొండ బాబు సహకారంతో ఎమ్మెల్యే నెహ్రూ, నవీన్ తో కలిసి మీ సమస్యలన్నీ పరిష్కరించి మీకు అన్ని సంక్షే మ పథకాలు అందేవిధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మానేపల్లి బంగార్రాజు, పాలకుర్తి సురేష్, బోండా వీరసత్య, కొత్త శ్రీరామకృష్ణ, దారా శ్రీనివాస్, బొండా రాజేష్, వి.నాగసత్య, కంచర్ల బాబు, బొండా జగ న్, పొట్టి రాజేష్, మానేపల్లి రామానుజ, కొత్త ప్రసాద్, ఉద్దగిరి కామేష్, నిట్టాల శ్రీనివాస్ తదితర ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు పాల్గొన్నారు.

సీతానగరం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో..

సీతానగరం గ్రామ టీడీపీ పార్టీ ఆధ్వర్యంలో జగ్గంపేట మండల టీడీపీ అధ్యక్షుడు జీను మణిబాబును ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ మా అభిమాన యువ నాయకుడు జీనుమణి బాబు మండల టీడీపీ అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా వారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేయడా నికి విచ్చేశామన్నారు. కార్యక్రమంలో సీతానగరం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



జగ్గంపేట మండల టీడీపీ అధ్యక్షుడు జీను మణిబాబును సత్కరిస్తున్న సీతానగరం టీడీపీ నాయకులు

సబ్‌ప్లాన్ ఏజెన్సీని ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలి

● ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతి



రంపచోడవరం ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సబ్‌ప్లాన్ ఏజెన్సీ నాయకులు

ప్రత్తిపాడు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సబ్‌ప్లాన్ ఏజెన్సీని ప్రత్యేక మండలంగా ఏర్పాటుచేయాలని కోరుతూ ఆదివారం రంపచోడవరంలో ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజనులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ప్రత్తిపాడు, తుని నియోజకవర్గంలోని 5 మండలాల్లో 59 ఉప ప్రణాళిక గిరిజన గ్రామాలను పెదమల్లాపురం కేంద్రంగా ప్రత్యేక మండలంగా ఏర్పాటుచేయాలని ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కోరా రు. రంపచోడవరం ఏజెన్సీలోని నూతనంగా గుర్తేడు కేంద్రంగా ప్రత్యేక మండలం ఏర్పాటు చేస్తు న్న తరుణంలో పెదమల్లాపురం మండలాన్ని కూ డా ప్రభుత్వం ప్రకటించాలని సబ్‌ప్లాన్ ఏజెన్సీ సాధన కమిటీ నాయకులు జర్తా ముసలయ్య, డి. బాలరాజు, నాగేశ్వరరావు తదితరులు ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కోరారు.

గణేష్ ఉత్సవానికి ఇదిగో అనుమతి

● పోలీస్ పోర్టల్ ద్వారా వినతి

శంఖవరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రుత్సు ఊరంతా వివిధ వర్గాలు ఈవేడుకలను కనుల పండువగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలను నిర్వహించాలనుకునేవారు పోలీసు అనుమతి తీసుకోవడం తప్పనిసరి. పోలీసుశాఖ ఈ అనుమతులు ఇచ్చేందుకు ఆన్‌లైన్ వేదికగా అవకాశం కల్పించింది. చవితి పందిరి వెయ్యాలనుకునే వారు, వినాయక ఉత్సవాలు నిర్వహించాలనుకునే వారు ఈ వెబ్ సైట్‌లో ద్వారా తమ వివరాలు నమోదు చేసుకోవాలి. ఇందుకు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ గణేష్ ఉత్సవ్ 2025 పేరుతో ఓపోస్టర్‌ను విడుదల చేశారు.

ఇలా నమోదు చేసుకోవాలి

గణేష్ ఉత్సవ్ డాట్ నెట్ 2025 వెబ్‌సైట్‌ను ఓపెన్ చెయ్యగానే కనిపించే అప్లైపై నొక్కాలి. ఫోన్ నంబరు ఆప్షన్‌వద్ద ఫోన్ నెంబరు ఎంటర్‌చేసి ఓటీపీని నమోదు చేయాలి. కమిటీవివరాలు నమోదుచేసి సబ్‌మిట్ చేస్తే మీ వివరాలను స్థానిక పోలీసువారు ధ్రువీకరణ చేసి అనుమతులు ఇస్తారు. వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే నిర్వాహకులు పోలీసుశాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి. ఎటువంటి ఇబ్బందులు లేకుండా వేడుకలు నిర్వహించుకునేందుకు మాకు సహకరించండి. వెబ్‌సైట్‌లో లాగినై వివరాలు నమోదుచేయండని సీఐ సూర్యఅప్పారావు తెలిపారు.

జగనన్నకాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌లు తీయకండి

● ఆవేదన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు తొలగించిన దృశ్యం

జగ్గంపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో గత ప్రభుత్వంలో జగనన్నకాలనీ ఏర్పాటు చేశారు. స్థానిక డిగ్రీ కళాశాలకు అతి సమీపంలో ఈ జగనన్నకాలనీ 75 ఎకరాల విస్తీర్ణంలో ఇళ్ల స్థలాలు ఇవ్వడంతోపాటు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇక్కడకు విద్యుత్ సరఫరాకోసం ప్రతి వీధికి అవసరమైన ట్రాన్స్‌పార్మర్లను ఏర్పాటు చేశారు. ఇటీవల జగ్గంపేటలో ఎక్కడ విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు మరమ్మతులకు గురైనా కొత్తగా ఉన్న ఈ విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లను తరలించుకు పోతున్నారు. దీంతో భవిష్యత్‌లో జగనన్న కాలనీకి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడితే ట్రాన్స్‌పార్మర్‌లు లేకపోవడంతో తమకు ఇబ్బంది కలుగుతుందని ఈ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఎక్కడ విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ అవసరమైనా ఈప్రాంతం నుంచి తొలగించి తీసుకెళుతున్నారని గత ప్రభుత్వ హయాంలో కోట్ల రూపాయలు వెచ్చించి ఈ పథకాన్ని చేపట్టారని మరి వీరికి అవసరమైనప్పుడు విద్యుత్‌శాఖ అధికారులు ప్రత్యేక నిధులతో వారు ట్రాన్స్‌పార్మర్లు ఏర్పాటుచేసుకోవాలి తప్ప కాలనీలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌లు తీసుకెళ్లడం వేరేచోట్ల బిగించడం ఎంతవరకు సమంజసం అని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

పేకాటరాయుళ్ల అరెస్టు

● రూ.10,250లు స్వాధీనం

జగ్గంపేటరూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని జె.కొత్తూరు గ్రామ శివారున మామిడితోటలో జరుగుతున్న పేకాట శిబిరంపై జగంపేట పోలీసులు దాడులు నిర్వహించారు. నలుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,250 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.ఐ రఘునాథరావు తెలిపారు. ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్ఐ రఘునాథరావు హెచ్చరించారు.

పంచాయతీరాజ్ మినిస్టీరియల్ కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

తునిరూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):తుని నియోజకవర్గంలో పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎన్నిక ఆదివారం తుని మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా టీఆర్ఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా రవణమూర్తి ఎన్నికయ్యారు. సెక్రటరీగా శశికుమార్, జాయింట్ సెక్రటరీగా సత్యనారాయణ, ఆర్గనైజేషన్ సెక్రటరీగా బి.చక్రపాణి, ట్రెజరర్‌గా దివ్య ఎన్నికై బాధ్యతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎన్నికైన కార్యవర్గాన్ని నియోజకవర్గ పంచాయతీరాజ్ ఎంప్లాయిస్ అభినందించారు.

31న కాంట్రాక్ట్ లెక్చరర్ల రాష్ట్ర కౌన్సిల్ అత్యవసర సమావేశం

ప్రత్తిపాడు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):కాంట్రాక్ట్ లెక్చరర్ల రాష్ట్ర కౌన్సిల్ ఈనెల 31న విజయవాడ యూటీఎఫ్ భవన్‌లో అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొర్ల మాణిక్యం తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాంట్రాక్ట్ లెక్చలర్ల సర్వీస్ రెగ్యులరైజేషన్ ప్రక్రియను పునఃప్రారంభించాలని డిమాండ్‌తో ఈ అత్యవసర సమావేశం నిర్వహించినట్లు గొర్ల తెలిపారు. ఈ సమావేశానికి ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి, మాజీ ఎమ్మెల్సీలు రాష్ట్ర నలుమూలల నుంచి కాంట్రాక్ట్ లెక్చలర్ల అసోసియేషన్ ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17నెలలు గడుస్తున్నా కాంట్రాక్ట్ లెక్చలర్ల సర్వీసు క్రమబద్ధీకరణ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌లు కాంట్రాక్ట్ లెక్చలర్లను వెంటనే రెగ్యులర్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గొర్ల మాణిక్యం కోరారు.

లోవలో భక్తుల కోలాహలం

● ఆలయానికి రూ.4.98 లక్షల ఆదాయం

తునిరూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనానికి తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ప్రత్యేక క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా లోవకి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఏర్పాటుచేసిన వసతి గదిలో వంటావార్పులు తీసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం ఒక్కరోజే లోవకి తరలివచ్చిన భక్తుల నుంచి ఆలయంలో వివిధ విభాగాలు ద్వారా రూ.4.98లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి విశ్వనాధరాజు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లుచేసి తీర్థప్రసాదాలు అందజేశామన్నారు. అలాగే రూరల్ సీఐ చెన్న కేశవరావు ఆధ్వర్యంలో లోవలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా బందోబస్తు నిర్వహించారు.



భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు